ఆలయ అభివృద్ధికి విరాళం



రామంతాపూర్ : రామంతాపూర్ గోఖలేనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి పర్వతాపురం రమేష్ వసుమతి కూమార్తెలు సాయిప్రశాంత్, సంధ్య, ఝాన్సీ రూ.1,31,000 మంగళవారం ఆలయ ప్రతినిధి మురళీధర్‌నాయక్‌కు అందజేశారు. రేవు నరసింహ, సంతోష్‌గుప్తా, అరుణ్, రాజిరెడ్డి, దయాకర్‌రెడ్డి, నాగేష్, రామేశ్వర్, పవన్ తదితరులున్నారు.

కార్పొరేటర్ పర్యటన



కార్పొరేటర్ స్వర్ణరాజ్‌ను సన్మానిస్తున్న ఎన్‌ఆర్‌ఐ కాలనీవాసులు

కాప్రా: ఎన్‌ఆర్‌ఐ కాలనీలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి స్థానిక సమస్యలు తెలుసుకునేందుకు పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు, సీసీరోడ్ల నిర్మాణం తదితర పనులు చేపట్టాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కార్పొరేటర్‌ను కాలనీవాసులు శాలువాతో సత్కరించారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించండి



కార్పొరేటర్ శాంతికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మల్లాపూర్: నాచారం అన్నపూర్ణ కాలనీలోని బుడగ జంగాల శ్మశానవాటికను అభివృద్ధి చేస్తానని, నాచారం కార్పొరేటర్ శాంతిసాయి జెన్‌శేఖర్ అన్నారు. మంగళవారం బుడగ జంగాల అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్‌ను కలిసి సౌకర్యాలు కల్పించాలని వినతి పత్రం అందజేశారు. శ్మశానవాటికలో బర్నింగ్‌ఫ్లాట్‌ఫారం, సిమెంట్ రోడ్డు, గదులు ఏర్పాటు చేయాలని కోరారు. నర్సింహ, క్రిష్టయ్య, నరసింహ, శంకర్, శివరామ్, కృష్ణ,సుధాకర్, మల్లేష్, రాము,శ్రీకాంత్, రాహుల్ తదితరులున్నారు.


ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ బండ బస్తీలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. మంగళవారం బస్తీలో మురుగు నీటివ్యవస్థ మూసివేయడం, రోడ్లు, వీధిలైట్లు తదితర సమస్యలను బస్తీవాసులు కార్పొరేటర్‌కు వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని కార్పొరేటర్ వారికి హామీ ఇచ్చారు. జలమండలి మేనేజర్ చారి, శేఖర్, షర్నగిరి, అరుణ్, సాజిద్, బస్తీవాసులు తదితరులున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి



స్థానికులతో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ సొసైటీ సర్వే నెంబర్ 844లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి సదరు స్థలాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి మండల తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి కబ్జాలకు గురికాకుండా కంచె ఏర్పాటు చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్, మోహన్ రాజు, రాంచందర్, కొమురయ్య, ఫరీద్, రాందాస్, సంతోష్‌ముదిరాజ్, కనకలక్ష్మి, స్వీటి, యాదగిరి, సంపత్‌గౌడ్, వినోద్‌యాదవ్, లక్ష్మి తదితరులున్నారు.

ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు కరువు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించామని ఓ వైపు చెబుతున్నా క్షేత్రస్థాయిలో రామంతాపూర్‌లోని ప్రభుత్వ స్కూళ్లల్లో తాగునీరు, శానిటేషన్ తదితర సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి.

– రామంతాపూర్



రామంతాపూర్ పాఠశాలలో ఆరు బయటే చదువుకుంటున్న విద్యార్థులు

ఓల్డ్ రామంతాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాలతో పాటు ఉన్నత పాఠశాలలు కూడా ఉన్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ఉన్న ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య వేయి మంది వరకు ఉంటారు. పాఠశాల ప్రాంగణ విస్తీర్ణం తక్కువై, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఆటలు కూడా ఆడలేకపోతున్నారు. దీంతో వారు వాహనాలు తిరిగే రోడ్లపైనే ఆటలాడుతూ ఉండటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

కట్టెల పొయ్యిపైనే వంటలు..

పాఠశాల ప్రాంగణంలోనే మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యిలపై వండటం వల్ల దాని నుంచి వచ్చే పొగతో విద్యార్థులు వంటలు వండే మహిళలు అనారోగ్యం పాలవుతున్నారు. గతంలో మధ్యాహ్న భోజనం వండటానికి ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేసేది. గత రెండేళ్లుగా గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో కట్టెల పొయ్యి మీదే వంట వండుతున్నారు. వేయిమంది ఉన్న ఈ పాఠశాలలో ఒకే ఒక్క నల్ల కనెక్షన్ ఉండటంతో విద్యార్థులకు కావాల్సిన తాగు నీరు అందకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలి..

పాఠశాలకు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పాఠశాలకు కేటాయిస్తే క్రీడా మైదానంలో ఉపయోగించుకుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనికోసం ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. ఇటీవల ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, ఉప్పల్ నియోజకవర్గ కన్వీనర్ సుధారాణిల ఆధ్వర్యంలో ఓ ప్రతినిధుల బృందం ఈ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన మెనూ బాగుందని అయితే తాగునీటి కటకటతో పాటు విద్యార్థులు ఆడుకోవడానికి క్రీడా ప్రాంగణం లేదని తాము గుర్తించామన్నారు.

జిల్లా పరిషత్ హైస్కూల్లో తాగునీటి కటకట
- పట్టించుకోని అధికారులు
- ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

పరిష్కరించకుంటే ఆందోళన చేపడతాం..

తాగునీటి సరఫరా సమస్యను స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్తామని పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రామంతాపూర్ ప్రగతినగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో స్థానికులు తమ వాహనాలను పార్కింగ్ అడ్డాగా మార్చుకుని ఈ పాఠశాల ప్రాంగణంలోనే నిలుపుతున్నారు. దీంతో విద్యార్థులు ఆటలాడుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. ఇందిరానగర్‌లోనే ఉర్దూ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. కొత్తగా భవనాన్ని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన ఉర్దూ ప్రాథమిక పాఠశాల

ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి..

రామంతాపూర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించేలా ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా వేసవి సెలవుల్లో పాఠశాలలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వ పాఠశాలల్లో నల్లా కనెక్షన్ ఏర్పాటు చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి తీసుకురావాలి.

ప్రభుత్వ స్థలాల కబ్జాపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మచ్చబొల్లారంలో హిందూ శ్మశానవాటిక ఆక్రమణకు గురవుతుందన్నారు. శ్మశానవాటిక స్థలంలో డంపింగ్ యార్డు నిర్మాణాలు జరుగుతున్నాయని వీటిని నిలిపివేయాలని కోరారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని జొన్నబండలో సర్వేనెంబర్ 582,583లలో యూఎల్‌సీ స్థలంలో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వీటి పరరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.నెరేడ్‌మెట్‌లోని 278 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందన్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని 398,399 సర్వేనెంబర్లలో వక్ఫ్ భూములను రక్షించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్న సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం వల్లే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందన్నారు. ఇప్పటికైనా హైడ్రా అధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వ స్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన హైడ్రా కమిషనర్ త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నేతలు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

పేలుడు ప్రాంతంలో ప్రత్యేక బృందాల తనిఖీలు



చర్లపల్లి పారిశ్రామికవాడ ఘటనా స్థలంలో ప్రత్యేక బృందాల తనిఖీలు

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలో పేలుడు జరిగిన ప్రాంతంలో మంగళవారం ప్రత్యేక బృందాలు విస్తృత తనిఖీ చేపట్టాయి. శనివారం జరిగిన పేలుడుతో నాగరాజు అనే వ్యక్తి మృతి చెందిన స్థలంలో సహాయక చర్యలు చేపట్టిన పోలీసులకు గాయాలయ్యాయి. ఆ ప్రాంతాన్ని గత మూడ్రోజులుగా నిషేధిత ప్రాంతంగా ప్రకటించారు. అగ్నిమాపక సిబ్బంది, బాంబ్ స్క్వాడ్, క్లూస్ టీమ్, ఇండస్ట్రియల్ సేఫ్టీ అధికారులు, టీఎస్‌ఐఐసీ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. ఏసీపీ మహేష్ పర్యవేక్షణలో తనిఖీలు చేపట్టిన స్పెషల్ టీమ్స్ మరిన్ని పేలుడు రసాయనాలు ఉన్నాయనే అనుమానంతో చెత్తను పెట్రోల్ పోసి నిప్పంటించారు. అనంతరం ఫైరింజన్ సాయంతో నీళ్లు చల్లుతూ నిర్వీర్యం చేసే ప్రయత్నం చేశారు. చుట్టుపక్కల సీసీకెమెరాలను పర్యవేక్షిస్తూ దర్యాప్తు ప్రారంభించారు. చెత్త, రసాయనాలు ఎవరు వేస్తున్నారనే కోణంలో విచారణ చేపట్టారు. ప్రస్తుతం జరుగుతున్న విచారణ బుధవారం కూడా కొనసాగనున్నట్లు ప్రత్యేక బృందాలు స్పష్టం చేశాయి.

విచారణ చేపడుతున్నాం..

ఘటనా స్థలంలో పేలుడుకు సంబంధించిన కారణాలపై విచారణ చేపడుతున్నాం. క్లూస్ టీమ్‌తో తనిఖీలు నిర్వహిస్తుండగా పేలుడుకు కారణమైన కొన్ని రసాయనాలను గుర్తించాం. పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి అన్ని జాగ్రత్తలు తీసుకుని చెత్తను తొలగిస్తున్నాం. పేలుడుకు కారణమైంది ఏ కెమికల్ అనేది గుర్తించేందుకు ల్యాబ్‌కు పంపాం. ఇష్టానుసారంగా రసాయనపదార్థాలు పారవేస్తే తక్షణమే స్థానికులు తమకు ఫిర్యాదు చేయాలి.

– ఏసీపీ మహేష్

నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ మారుతీనగర్‌లో నీటి ఎద్దడిని తీర్చాలని డిమాండ్ చేస్తూ జలమండలి కార్యాలయం వద్ద కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్‌తో పాటు స్థానికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణనగర్, మారుతీనగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. శ్రీకృష్ణనగర్‌లో మ్యాన్‌హోల్ మరమ్మతులు, నాలా, కల్వర్ట్ నిర్మాణం చేపట్టాలని కోరానన్నారు. మారుతీనగర్‌లో పవర్‌బోర్లు ఎండిపోయాయని, తాగునీటి సరఫరా కూడా లోప్రెషర్ రావడంతో సమయాన్ని కుదించారన్నారు. కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఈ సమస్యను జీఎం దృష్టికి తీసుకెళ్లామని సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం డీజీఎం ఆశ్రితకు వినతిపత్రం అందజేశారు. ఏఈ నవీన్, సునీల్‌యాదవ్, రమేష్, తేజ, నాగార్జున, జైకృష్ణ తదితరులు పాల్గొన్నారు



డీజీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

వైభవంగా తిరుకల్యాణోత్సవం

మౌలాలి: వినాయకనగర్ డివిజన్ వినోభానగర్ శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా మంగళవారం తిరుకల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకరించిన వెంకటేష్, పద్మ దంపతులకు స్వామివారి శేష వస్త్రాన్ని అందజేసి అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. శ్రీరామనవమికి కావాల్సిన సహకారం అందిస్తానని వెంకటేష్ చెప్పారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు కాసం వెంకటహరి, యంసాని శ్రీనివాస్, కోశాధికారి సంతోష్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు లక్ష్మీ నారాయణ, యంసాని రవి, గుబ్బ రాంచంద్రం, కంసాని నరసింహ, భక్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనేక అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాలు, సదుపాయాలు లేని ప్రదేశాల్లో కొనసాగుతున్నాయని, కొన్ని కేంద్రాల్లో తగిన వసతులు లేవన్నారు. పలు కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్లు లేవని దీంతో పిల్లలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటి వసతి, శానిటరీ తదితర సమస్యలను పరిష్కరించాలని ఆయన వినతిపత్రంలో కోరారు.

బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేస్తామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆనంద్‌బాగ్‌లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీకి అంకితభావంతో పనిచేసే నాయకులకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు



మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

అదృశ్యమైన వ్యక్తి మృతి



ఆసిఫ్ (ఫైల్)

మల్కాజిగిరి: అదృశ్యమైన వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆర్టీసీ కాలనీకి చెందిన ఆసిఫ్ వాచ్‌మెన్‌గా పనిచేస్తుండేవాడు. తాగుడుకు బానిసైన అతడు ఈనెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈనెల 23న ఆర్‌కేనగర్‌లో అపస్మారకస్థితిలో పడి ఉన్న ఆసిఫ్‌ను గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా 24న మృతి చెందాడు. ఆసిఫ్ ఇంటికి తిరిగిరాకపోవడంతో మంగళవారం ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఆసిఫ్ భార్య రూహిని గాంధీ ఆసుపత్రి మార్చురీకి వెళ్లింది. చనిపోయిన వ్యక్తి తన భర్త ఆసిఫ్‌గా గుర్తించిందని ఎస్సై స్పష్టం చేశారు.

అసెంబ్లీ సందర్శనకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులు అసెంబ్లీకి వెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. చట్టసభల గురించి విన్న విద్యార్థులు చట్టాలను చేసే అసెంబ్లీని చూడాలన్న ఆకాంక్షతో వారికి ఈ ఏర్పాటు చేశామన్నారు. జగదీష్‌గౌడ్, వెంకన్న పాల్గొన్నారు.

చర్లపల్లి జైలులో ఆహార వస్తువులకు టెండర్లు

కుషాయిగూడ: చర్లపల్లిలోని కేంద్రకారాగారంలో ఖైదీలకు సంబంధించిన ఆహార వస్తువులతో పాటు ఇతరాత్ర వాటికి సంబంధించిన టెండర్లు ప్రకటించారు. ఈ టెండర్ల దక్కించుకునేందుకు ఆసక్తిగల వారు దరఖాస్తులు సమర్పించాలని జైలు పర్యవేక్షణాధికారి తెలిపారు. వచ్చేనెల 2వ తేదీ వరకు దరఖాస్తుదారులు చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని పనిదినాల్లో అందుబాటులో ఉంటారన్నారు. పూర్తి వివరాలకు 9494632101, 9494632113, 9490549502, 9000990589, 9866922657.

ఆసక్తి ఉన్న రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి

మౌలాలి: మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీలోని వీఎంఆర్ గ్రామర్ హైస్కూల్‌లో నిర్వహించిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంది. మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరైన లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రూపారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకశక్తి సైన్స్‌ఫెయిర్ లాంటి కార్యక్రమాల ద్వారా వెలుగులోకి వస్తుందన్నారు. బాల్యం నుంచే పిల్లల్లో ఉన్న ఆసక్తిని గమనించి, ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో దేశం గర్వించే స్థాయికి ఎదుగుతారన్నారు. అనంతరం వివిధ తరగతుల విద్యార్థినీ విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు రకాల మోడల్స్, వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శన అతిథులను ఆకట్టుకున్నాయి. ఉమాశ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మల్లికార్జున్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొన్న అతిథులు

ఉగాది ఉత్సవానికి ఆహ్వానం

గౌతంనగర్: మల్కాజిగిరి నగర రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఈనెల 30న తిరుమల గార్డెన్‌లో నిర్వహించే ఉగాది ఉత్సవానికి రావాలని కోరుతూ స్వయం సేవకులు మంగళవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మైనంపల్లికి ఆహ్వానం అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహనరాజు, ఆర్‌ఎస్‌ఎస్ శివాజీ ప్రభాత్ శాఖ కార్యవాహ ప్రభాకర్‌చారి, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ యాదవ్, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కాప్రా: శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి సీతా రామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలు ఇంటి వద్దకే అందించేందుకు తెలంగాణ ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. కుషాయిగూడ డిపో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ డిప్యూటీ ఆర్‌ఎంజీ పవిత్ర ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. సీతారామచంద్రస్వామి కల్యాణం భద్రాద్రి వెళ్లి చూడలేని వారి కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో రాములోరి తలంబ్రాలు నేరుగా ఇంటి వద్దకే చేర్చుతున్నట్లు తెలిపారు. బుకింగ్‌కు 91542 98833, 98488 52211.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం



వెంకటరావు (ఫైల్)

అల్వాల్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నెరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెరేడ్‌మెట్ జేజేనగర్‌లో నివసించే వెంకటరావు (28), భార్య సునీతతో కలిసి ఉంటున్నారు. వెంకటరావు తన భార్య సునీతతో గొడవపెట్టుకుని ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగం పోయిందని మనస్తాపంతో మరో వ్యక్తి..



అభిలాష్ (ఫైల్)

ఉద్యోగం పోయిందని మనస్తాపంతో మరో వ్యక్తి కనిపించకుండా పోయాడు. సఫిల్‌గూడ పావని రెసిడెన్సీలో నివసించే కొత్తపేట అభిలాష్ (27) ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. కాగా తాను చేస్తున్న ఉద్యోగం పోయిందని మనస్తాపంతో ఈనెల 24న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో మహిళ..



మమత (ఫైల్)

ఓ మహిళ అదృశ్యమైన ఘటన నెరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యనగర్ శ్రీకృప అపార్టుమెంట్‌లో నివసించే దాసరి మమత (22) ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. భర్తతో గొడవల కారణంగా పుట్టింట్లోనే ఉంటోంది. ఈనెల 22న తల్లి పనికి వెళ్లి ఇంటికొచ్చి చూసేసరికి కుమార్తె ఇంట్లో కనిపించలేదు. దీంతో ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.